## క్లుప్తంగా

### పాడి రైతులకు రాయితీపై దాణా



పాడి పెంపకందారులకు దాణా అందజేస్తున్న పశు వైద్యాధికారిణి

**ఉయ్యాలవాడ** : పశు పెంపకందారులకు ప్రభుత్వం సరఫరా చేసిన సంపూర్ణ మిశ్రమ దాణా పశు వైద్యాధికారిణి నాగశైలజ ఆదివారం అందజేశారు. మండలంలోని హరివరం, అల్లూరు, ఇంజేడు, ఉయ్యాలవాడ పశు వైద్యశాలల పరిధిలోని పశువులకు పోషక దాణా 10.5 మెట్రిక్ టన్నులు మొదటి విడతగా సరఫరా అయిందన్నారు. 50 శాతం సబ్సిడీతో 50 కేజీల బస్తా దాణా రూ. 554కు పాడి రైతులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

### 28 నుంచి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు



ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

**శిరివెళ్ల:** యర్రగుంట్లలో ఈ నెల 28 నుంచి విగ్రహాల ప్రతిష్ఠోవాలు ప్రారంభం కానున్నాయి. దాతల విరాళాలతో పునర్నిర్మించిన ఆలయంలో ఎల్లమ్మ తల్లి, పోతురాజు, వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠలు జరగనున్నాయి. 28న గణపతి పూజ, గోపూజ, దీక్షా ధారణ, రక్షా బంధం, నవగ్రహ, వాస్తు ప్రధాన కలశ స్థాపన కార్యక్రమాలు జరుగుతాయి. 29న రుద్రాభిషేకం, చండిహోమం, నవగ్రహ ప్రతిష్ఠ హోమం జరుగుతుంది. 30వ తేదీన యంత్ర ప్రతిష్ఠ, ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి.

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

**దొర్నిపాడు:** మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. జూన్ 8, 9, 10 తేదీల్లో దేవర సందర్భంగా పెద్దమ్మకు ముడుపు కట్టారు. దీంతో భక్తులు పెద్దమ్మకు ఎలాంటి మొక్కులు చెల్లించకుండా ప్రత్యేక పూజలు మాత్రమే చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

### వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎస్టీ జాబితాలో చేర్చాలని నినదిస్తున్న నాయకులు

**నంద్యాల(అర్బన్):** వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వడ్డెరులను సర్కారు ఆదుకోవాలన్నారు. వడ్డెర కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల రుణాలు ఇవ్వాలని, సంఘం భవనం ఏర్పాటుకు 500 గజాల స్థలం కేటాయించాలన్నారు. అర్హులకు ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలుడు, శ్రీనివాసులు, భాస్కర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ సవరణ చట్టంపై నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

**ఆళ్లగడ్డ:** వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ఆదివారం ఆళ్లగడ్డ పట్టణంలో ముస్లి పర్సనల్ లా బోర్డు నేతృత్వంలో ముస్లిం మైనార్టీ సంఘాలు శాంతియుత ర్యాలీ, నిరసనలు తెలిపాయి. స్థానిక పాత మసీదు ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు చేపట్టిన ఈ ర్యాలీకి ముస్లిం మహిళలు, చిన్నపిల్లలు నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల బెలూన్లు ఎగరవేస్తూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ.. మైనారిటీల హక్కులకు వక్ఫ్ సవరణ చట్టం ముప్పుగా మారిందన్నారు. కేంద్రం వెంటనే సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# సాగుకు సమాయత్తం

- పలకరించిన తొలకరి
- పదునైన పొలాలు
- జోరందుకున్న వ్యవసాయ పనులు



పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో పొలంలో వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు



ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో ట్రాక్టర్ సహాయంతో పొలాన్ని దున్నుతున్న రైతు



శిరివెళ్లలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు

**ఉయ్యాలవాడ/శిరివెళ్ల :** గతేడాది సరిగ్గా పంటలు పండకపోవడం, వచ్చిన అరకొర దిగుబడికి మద్దతు ధర లభించకపోవడంతో రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. ఈ ఏడాదైనా కలిసి వస్తుందే మోనన్న ఆశలతో ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. సీజన్‌కు ముందుగానే విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. గత ఏడాది సాగు చేసిన మొక్కజొన్న, మిరప, పత్తి, మినుము, పొగాకు, తదితర పంట పొలాల్లో అవశేషాలు(వ్యర్థాలు)ను తొలగింపు, సేంద్రీయ ఎరువులు తరలింపు పనుల్లో బిజీ రైతన్నలు అయ్యారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఉయ్యాలవాడ, శిరివెళ్ల మండలాల్లో ఐదు వేల హెక్టార్లకు పైగా వరి, మొక్క జొన్న, మినుము, పత్తి కంది, మిరప, సోయాబీన్, పొగాకు, పెసర తదితర పంటలు సాగు చేశారు. ఈసారి కూడా అదే స్థాయిలో పంటల సాగు ఉండొచ్చని వ్యవసాయాధికారుల అంచనా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగుకు ముందే జీలుగ, పిల్లి పెసర, కంది, తదితర విత్తనాలు సబ్సిడీపై ఆర్‌బీకేల ద్వారా అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు బయట మార్కెట్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది.

## ప్రతిభకు పురస్కారం



అవార్డులు అందుకున్న విద్యార్థులతో నాయకులు

**నంద్యాల(న్యూటౌన్):** పదవ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నంద్యాల పట్టణం కురువ సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈకార్యక్రమంలో అధ్యక్షుడు విజయ్‌కిరణ్ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కుటుంబ సామాజిక పరిస్థితులను కూడా విద్య ప్రభావితం చేస్తుందని తెలిపారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటో, అవార్డులు, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల మండల కురువ సంఘం కమిటీ సభ్యులు విజయ్ కుమార్, శ్రీరాములు, హరినాథ్‌బాబు, శంకర్, శివరాం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి స్వర్ణోత్సవ మహాకుంభాభిషేకం



కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రీభగవత్ సేవా సమాజ్ సభ్యులు

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలోని సంజీవనగర్‌లో శ్రీకోదండ రామాలయం ఏర్పడి 50 సంవత్సరాలు గడిచిన సందర్భంగా శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్వర్ణోత్సవ మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అధ్యక్షుడు సూరయ్య, మధుసూదన్ ఆవిష్కరించి మాట్లాడారు. 28వ తేదీన ఉదయం గోపూజతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, జపాలు, నవచండీ పారాయణం, సుందరకాండ పారాయణాలు నిర్వహించి సాయంత్రం మహిళలకు సామూహిక ఒడి బియ్యం నిర్వహిస్తున్నామన్నారు. 29న గురువారం కలశ సంకల్ప పూజ కార్యక్రమం, జగద్గురు పుష్పగిరి శంకరాచార్య పీఠాధిపతులు, శ్రీవిద్యాశంకర భారతి స్వామి వారికి శోభాయాత్ర కార్యక్రమం, సాయంత్రం స్వామి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. 30వ తేదీ ఉదయం ఆలయాలకు మహాకుంభాభిషేక కార్యక్రమం పీఠాధిపతి విద్యాశంకర భారతితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ఆరోగ్యకర సమాజానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

**నంద్యాల(వ్యవసాయం):** ఆరోగ్యకర సమాజం కోసం ఆరోగ్యభారతి సంస్థ కృషి చేస్తుందని ఆసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి పేర్కొన్నారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య సలహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ సహదేవుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ రామ్మోహన్, బాలవెంకటకృష్ణ హాజరై మాట్లాడారు. వృద్ధాప్యంలో కీళ్ల వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన వ్యాయామాలు, ఆహారంలో తీసుకోవాల్సిన పదార్థాల గురించి వివరించా రు. అదే విధంగా దంత సమస్యలు, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పరమేశ్వరరెడ్డి, చెన్నకేశవులు, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడే వారికే పదవులు



కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న కరిమద్దెల నాయకులు

**గడివేముల:** వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు తప్పక లభిస్తాయని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ మండల సభ్యులను నియమించారు. ఈ మేరకు పదవులు పొందిన వారు ఆదివారం కాటసాని రాంభూపాల్ రెడ్డిని కల్లూరులోని ఆయన ఇంట్లో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు పొందిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కోవాలని అండగా ఉంటామన్నారు. ఉపాధ్యక్షుడు దాలుస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేందర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్లయ్య, శివారెడ్డి, అన్నెం మహేశ్వర్ రెడ్డి, దర్గా స్వామి, బాల వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో మహానంది కిటకిట

**మహానంది:** క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేలాది మంది భక్తజనం తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ తగ్గలేదు.మూడు రోజుల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులతో దేవస్థానానికి చెందిన తక్కువగా ఉన్న వసతి గృహాలు నిండిపోతుండటంతో ప్రైవేట్ లాడ్జీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు లాడ్జీల నిర్వాహకులు అధిక మొత్తం వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. దేవస్థానం, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి నిర్ణీత ధరలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## యోగా మాస్టర్ల గౌరవ వేతనాన్ని పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గోస్పాడు:** యోగా మాస్టర్ల గౌరవ వేతనం పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ ఆరోగ్య మందిర్ యోగ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తిరుమలయ్య, నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఆయుష్ శాఖ ఇచ్చే గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ ఆదివారం డీఎంహెచ్ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగా మాస్టర్లు రోజు 50 కిలోమీటర్లు ప్రయాణం చేసి విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. అందుకు ఇచ్చే అరకొర గౌరవ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. ప్రతి మండలంలో ఒక యోగ మందిరాన్ని ఏర్పాటు చేసి ఇద్దరు యోగ మాస్టర్లకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య మందిర్ యోగ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీదేవి, రూపాదేవి, చరిత, మల్లేశ్వరి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 1న ఉచిత వడుగులు

**నంద్యాల(అర్బన్):** ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న ది క్యాంపస్ స్కూల్‌లో జూన్ 1వ తేదీ ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు జీఎంగౌస్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌బాషాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వడుగుల కార్యక్రమం జరుగుతుందని, దీనిని ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 9848981891, 9032205502 నంబర్లను సంప్రదించాలన్నారు.

## నేడు పీజీఆర్ఎస్

**ఉయ్యాలవాడ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

## మహిళ ఆత్మహత్య

**రుద్రవరం:** మండల కేంద్రమైన రుద్రవరం పడమటి వీధికి చెందిన జగదీశ్వరి (30) అనే మహిళ ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జగదీశ్వరి, నాగచంద్ర దంపతులకు నాలుగేళ్ల కూతురు,11నెలల కుమారుడు ఉన్నారు. అయితే కొంత కాలంగా వారి మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో రసాయన పొడిని నీటిలో కలుపుకొని తాగి కుప్పకూలింది.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలే మృతి చెందారు.

## పెళ్లికావడం లేదని యువకుడి బలవన్మరణం


**బొమ్మలసత్రం:** తనకు వివాహం కావడం లేదని రాముడు (29) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన మేరకు.. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సుగునమ్మ కుమారుడు రాముడు పట్టణంలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహించుకుని రాత్రి హోటల్‌పైన ఉన్న తన గదిలోకి వెళ్లి పోయాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ అదేరోజు రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి గది నుంచి దుర్వాసన రావటంతో హోటల్ యజమాని రాముడు గది తలుపులు బద్దలు కొట్టి చూడగా మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పెద్దమ్మకు బోనాల సమర్పణ



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

**మహానంది:** మండలంలోని గోపవరం గ్రామంలో పెద్దమ్మ విగ్రహ, నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవాలు పూర్తయి 41 రోజులైన సందర్భంగా ఆదివారం గ్రామంలో వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ఉదయం నుంచే పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేడుకల సందర్భంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పెద్దమ్మ అమ్మవారికి బోనాలు తెస్తున్న మహిళలు

# బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



తోడేండ్లపల్లె గ్రామంలో బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న భూమా కిషోర్‌రెడ్డి

**చాగలమర్రి:** ఎ.కంబాలదిన్నె గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆళ్లగడ్డ వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తోడేండ్లపల్లె గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎంతో మంది మహిళలు అదృశ్యమయ్యారని దుష్ప్రచారం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు చిన్నారి మీద అత్యాచారం జరిగితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నందికొట్కూరులో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన మరువక ముందే మరో ఘటన జరగడం దురదృష్టకరం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుండటం వల్లే దాడులు, అత్యాచార సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆయన వెంట నాయకులు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

## నరసింహస్వామి, చెంచులక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చెంచులక్ష్మి, నరసింహస్వామి అమ్మవార్లు



రెడ్డిపల్లెలో హోమ గుండం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**రుద్రవరం:** మండల కేంద్రం రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతం వద్ద వెలసిన దొర్వి నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద పండితులు స్వామి అమ్మవార్లను వేద మంత్రోచ్ఛారణలతో అభిషేకించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

## చారిత్రక కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**నంద్యాల(వ్యవసాయం):** జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, చారిత్రక వైభవ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని నంద్యాల జిల్లా ఇన్‌ట్యాచ్ చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ కంభం చిన్నపురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యోగా కాన్సస్ నెస్ ట్రస్టు నందు ఆదివారం ఇన్‌ట్యాచ్ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల చాప్టర్ మన ఊరు, మనగుడి, మన బాధ్యత సభ్యుల ఆధ్వర్యంలో జిల్లాలోని పురాతన ఆలయాలు, కోనేరులను శుభ్ర పరచడం, అతిథి దేవోభవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో హెరిటేజ్ వాక్ ద్వారా ప్రజలను జాగృతం చేస్తామని చారిత్రిక సాంస్కృతిక విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు, యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాపారులు, ఉద్యోగులు, ఇతర వర్గాల వారు సంస్థలో సభ్యులుగా చేరి సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం నంద్యాల చాప్టర్ కో కన్వీనర్‌గా కటకం రఘువీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం పాగాలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న కృత్తి సుబ్బారావు, దుర్గా దంపతులను చాప్టర్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేతురామన్, సుబ్బరామయ్య, రామకృష్ణారెడ్డి, గెలివి సహదేవుడు, డాక్టర్ కిశోర్‌కుమార్, శ్రీదేవి, అన్నెం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆత్మీయ కలయిక..ఆనంద వేడుక



గురువులకు పూలతో స్వాగతం పలుకుతున్న పూర్వ విద్యార్థులు



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**శిరివెళ్ల:** యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకగా సాగింది. 2005–06 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరి ఒకరినొకరు పలకరించుకొని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు దత్తన్న, శంకర్, మక్బుల్, సలాం, జ్యోతి, అన్న పూర్ణమ్మ, జగన్మోహన్‌రెడ్డిలపై పూలు చల్లుకుంటూ గ్రామంలో బ్యాండ్‌మేళాలతో ఊరేగించారు.తర్వాత శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శిరిగిరి నరసింహారెడ్డి, రామాంజనేయులు, అశ్వర్థరామిరెడ్డి, పావని, ఓబులేసు, రమేష్ ఆచారి పాల్గొన్నారు.

## తప్పిపోయిన పిల్లలను వెతికి పట్టుకోవాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల

**కర్నూలు (టౌన్):** తప్పిపోయిన పిల్లలను గుర్తించి వాళ్లను 24 గంటల్లోపు జిల్లా బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరచాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల సూచించారు. ఆదివారం జిల్లా లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ కాలనీలోని నైస్ యూత్ ఫర్ కల్చర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు తమ తల్లిదండ్రులు తిట్టారని, కొట్టారనే కారణాలతో పారిపోవడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు. ఆ పిల్లలు బస్సుల్లో గాని, రైలులో గానీ ప్రయాణం చేస్తుంటారని, సంఘ విద్రోహ శక్తులకు దొరికితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. తప్పిపోయిన పిల్లలను వెతికి పట్టుకొని బాలల సంక్షేమ సమితి వద్దకు తీసుకొస్తే వారికి వసతి కల్పిస్తామన్నారు. పిల్లలు చెప్పే వివరాలను నమోదు చేసుకొని ట్రాకింగ్ మిస్సింగ్ చైల్డ్ అనే పోర్టల్‌లో నమోదు చేస్తామని చెప్పారు. దీని వల్ల త్వరగా పిల్లలు ట్రేస్ ఔట్ అవుతారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైల్డ్ లీగల్ రైట్స్ కమిటీ సభ్యులు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్నారులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు తగిన సూచనలు చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద, శ్రీలక్ష్మి, పద్మ, గీత, వాణి, శ్వేత, కీర్తి, రంగమ్మ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో

**కొలిమిగుండ్ల:** స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ప్రధాన రహదారిపై ఆదివారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. నందిపాడుకు చెందిన లోక్‌నాథ్‌రెడ్డి, రాజాగోవిందు పని నిమిత్తం బైక్‌పై కొలిమిగుండ్లకు బయలు దేరారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేసే ఇతర రాష్ట్రాల కార్మికులు కొలిమిగుండ్లలో కూరగాయాలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ఆటోలో ఫ్యాక్టరీకి బయలు దేరారు. మార్గమధ్యలో వేబ్రిడ్జి సమీపంలోకి వెళ్లగానే ముందు వెళుతున్న లారీని ఆటో ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నందిపాడుకు చెందిన ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఆటో డ్రైవర్ భూపాల్, రామ్‌కో కార్మికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఆటో డ్రైవర్ టేప్ రికార్డులో పాటలు పెట్టుకొని వేగంగా డ్రైవ్ చేస్తు లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108లో తాడిపత్రికి, మిగిలిన వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.